ఊరెళ్తున్నారా... ఇళ్లు జాగ్రత్త



బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులు

- దొంగతనాలపై అప్రమత్తత అవసరం
- షాపింగ్ మాల్స్, రద్దీ ప్రాంతాల్లో పోలీసుల ప్రచారం
- ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో భద్రత లభిస్తుందని భరోసా

పండగవేళ.. పోలీసులకూ ఓ మాట చెప్పండి





సీతమ్మధార : సంక్రాంతి పండగ వస్తుందంటే ప్రతీ ఇంట సందడి మొదలవుతుంది. సొంత గ్రామాలకు వెళ్లాలని, కొత్త దుస్తులు కొనుక్కోవాలని ఉత్సాహం చూపిస్తుంటారు. ఇదే అదునుగా దొంగలు చేతివాటం చూపిస్తుంటారు. చాలా మంది పండగ సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లే తొందరలో అజాగ్రత్తగా వ్యవహరిస్తుంటారు. చుట్టుపక్కల వారికి కూడా ఇంటిపై కాస్త నిఘా ఉంచాలని చెప్పకుండా వెళ్లిపోతుంటారు. ఇదే అదునుగా దొంగలు ఇళ్లు గుల్ల చేస్తుంటారు. దొంగతనాలకు అడ్డుకట్ట వేయడంలో భాగంగా సంక్రాంతి పండగ నేపథ్యంలో పోలీసులు నేర నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కరపత్రాలు, ఆటోల ద్వారా ప్రచారం చేస్తున్నారు. మాల్స్, దుస్తుల దుకాణాల వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఇంటింటా ప్రచారం చేపడుతున్నారు. విశాఖపట్నంలో శ్రీకాకుళం, విజయనగరం, ఉభయ గోదావరి, కృష్ణా తదితర జిల్లాలకు చెందిన లక్షలాది మంది ప్రజలు స్థిరపడి నివసిస్తున్నారు. వీరంతా ఏటా సంక్రాంతి పండగకు స్వస్థలాలకు వెళ్తుంటారు.

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌తో రక్ష

తాళం వేసిన ఇళ్లైనా సరే దొంగలు చేతి వాటం ప్రదర్శించి కన్నం వేస్తారు. ఈ నేపథ్యంలో సాంకేతికత సాయంతో దొంగతనాలకు చెక్ చెప్పే ఆధునిక వ్యవస్థను నగర పోలీసులు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. పోలీసు శాఖ రూపొందించిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌ను ప్రజలు తమ మొబైళ్లలో డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ చేసుకోవాలి. ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా వెళ్లే ముందు ఈ యాప్ సహాయంతో పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో పోలీసులు మీ ఇంటి దగ్గర టెక్నాలజీ సహాయంతో భద్రత కల్పిస్తారు. ఈ యాప్‌ను ముందుగా గూగుల్ ప్లే స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఎప్పుడైనా ఊరికి వెళ్లినప్పుడు ఈ యాప్‌లోకి వెళ్లి యూజర్ ఐడీని టైప్ చేసి రిక్వెస్ట్ పోలీస్ వాచ్ ద్వారా సమాచారమివ్వాలి. అప్పటి నుంచి మీ ఇల్లు పోలీస్ నిఘాలో ఉంటుంది. ఒక వేళ దొంగలు వచ్చి తాళం పగులగొట్టేందుకు ప్రయత్నిస్తే.. అక్కడున్న కెమెరాలో అలారం మోగుతుంది. ఆ సమాచారం వెంటనే పోలీసులకు అందుతుంది. మీరు లేని సమయంలో ఎవరైనా ఇంటికి వస్తే ఆ వీడియోలు, ఫొటోలు సీసీ కెమెరాల సహాయంతో పోలీస్ కంట్రోల్ రూమ్‌కి చేరుతాయి. ఇవన్నీ ఈ యాప్‌తోనే సాధ్యమవుతాయి. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని నగర పోలీసులు కోరుతున్నారు. ద్వారకా, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ల పరిధిలో గల సీతమ్మధార, టీపీటీ కాలనీ, సీతంపేట, గణేష్‌నగర్ బాలయ్య శాస్త్రి లే అవుట్ తదితర ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లు, ఇతర నివాసాలు, షాపింగ్ కాంప్లెక్సులలో ఈ యాప్ గురించి క్రైం పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఊర్లో ముందు విధిగా పోలీసులకు సమాచారమిస్తే చోరీలు గణనీయంగా అరికట్టవచ్చని పోలీసులు వివరిస్తున్నారు.

ఊరెళ్తే.. ఏం చేయాలంటే...

- **ఇంటి చిరునామా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలి. ఎప్పుడు ఊరు వెళ్తున్నదీ..,** ఎప్పుడు తిరిగి వస్తున్నదీ పోలీసులకు తెలపాలి.
- ఇంటి యజమాని ఫోన్ నంబరు అందజేయాలి. లేదా వాచ్‌మెన్‌ను నియమించుకోవాలి.
- అపార్టుమెంట్లలో ఉన్న వారు వాచ్‌మెన్‌ను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలి. వాచ్‌మెన్ ఫొటో, అడ్రస్ తీసుకోవాలి. కొత్తవారు వచ్చేటప్పుడు రిజిస్టర్‌లో వారి పేరు, అడ్రస్, ఫోన్ నంబరు, ఎక్కడికి వెళ్తున్నదీ నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలి.
- అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో, ప్రవేశ ద్వారం, కారిడార్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లలో ఎక్కువ మొత్తంలో డబ్బులు, బంగారం, వెండి ఆభరణాలు ఉంచరాదు. బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి.
- **ప్రయాణాల్లో విలువైన వస్తువులు బ్యాగుల్లో పెట్టకూడదు. చిన్నపిల్లలు, బ్యాగులను ఎక్కడ పడితే అక్కడ వదిలిపెట్టి వెళ్లకూడదు.**
- షాపింగ్ చేసే వారు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. డబ్బులతో కూడిన బ్యాగులు ఉన్నప్పుడు జాగ్రత్తగా పట్టుకోవాలి. రద్దీగా ఉన్నచోట జేబు దొంగలు, బంగారు వస్తువులు దొంగిలించేవారు ఉంటారు. చుట్టుపక్కల వారిని గమనిస్తుండాలి.
- కరెన్సీ నోట్లు కింద పడేసి మీ దృష్టి మరల్చి విలువైన వస్తువులు, తెచ్చుకున్న డబ్బు కాజేసే అవకాశం ఉంటుంది. ముందుగానే జాగ్రత్త పడితే నష్ట నివారణ చేపట్టవచ్చు.
- వీలైనంత వరకూ డిజిటల్ లావాదేవీలకే ప్రాధాన్యమివ్వాలి.

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో చోరీలకు అడ్డుకట్ట



సంక్రాంతికి సొంత ఊళ్లకు వెళ్లే వారు తప్పకుండా తమ సమాచారాన్ని పోలీస్ స్టేషన్‌లో అందజేయాలి. లేదా పోలీస్ యాప్ ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగించుకోవాలి. పండగ షాపింగ్ చేసే సమయంలో నగదు, బంగారు వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అవసరమైనప్పుడు డయల్ 100, 1090కి ఫిర్యాదు చేయండి. ఈ యాప్‌ని ఊర్లెళ్లే ప్రజలంతా విధిగా డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా చోరీలను నివారించొచ్చు.

– సత్యారావు, ఫోర్తు టౌన్ ఎస్ఐ, (క్రైం)

క్లుప్తంగా

లావణ్య కుటుంబానికి పరామర్శ



లావణ్య భర్తను పరామర్శిస్తున్న రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, తదితరులు

సీతంపేట : తిరుపతి తొక్కిసలాట ఘటనలో మరణించిన సూరిశెట్టి లావణ్య కుటుంబాన్ని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.వి.రవిరాజు, సంజీవనాయుడు, గంగా మహేష్, దుప్పలపూడి శ్రీను తదితరులు శనివారం పరామర్శించారు. లావణ్య భర్త సతీష్‌తో మాట్లాడి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సన్యాసిరావు, తిరుపతిరావు, పైడిరాజు, అప్పారావు, రాణి, రమ, సింహాచలం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నూతన వస్త్రాలు పంపిణీ



కార్మికులకు నూతన వస్త్రాలు అందిస్తున్న జెడ్సీ రాము

మురళీనగర్ : మురళీనగర్ సుదర్శన్ పార్కులో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా పలువురు కార్మికులకు నూతన వస్త్రాలు అందించారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధి ఎంఆర్‌కే రంగారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.రాము పాల్గొని కార్మికులకు వస్త్రాలు అందించారు. జీవీఎంసీ 49, 50 వార్డుల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సూపర్‌వైజర్లు, మురళీనగర్‌లోని 8 పార్కుల్లో పని చేస్తున్న సిబ్బందికి వస్త్రాలు అందించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధులు ఎంఆర్కే రంగారావు, పృధ్వీరాజు, శంకరనారాయణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార : స్థానిక నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల మహా గణపతి ప్రసన్న వేంకటేశ్వరస్వామి, షిరిడీ సాయిబాబా దేవస్థానంలో శనివారం గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కూడార్తై పర్వదినాన్ని పురస్కరించుకుని కల్యాణోత్సవాలు నిర్వహించారు. అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే పూజలు నిర్వహించారు. అనంతరం గణపతి పూజ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

యూజీడీ లీకుతో అవస్థలు



అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట : యూజీడీ మ్యాన్ హోల్ లీకుతో జనం అవస్థలు పడుతున్నారు. జీవీఎంసీ 28వ వార్డు అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్ నుంచి ఎన్జీజీవోస్ కాలనీకి వెళ్లే మార్గంలో గౌతం రెసిడెన్సీ వద్ద యూజీడీ మ్యాన్ హోల్ పొంగి ప్రవహిస్తోంది. రోడ్డుపై మురుగు ఏరులా ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీలలితాపీఠంలో ఘనంగా కూడార్తై ఉత్సవం



గోదా రంగనాథులకు నివేదించిన కూడార్తై పాయసం

సీతంపేట : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 27వ రోజు అక్కయ్యపాలెం శ్రీలలితా పీఠంలో కూడార్తై ఉత్సవం ఘనంగా నిర్వహించారు. విశేష పాయసాన్ని తయారు చేసి 108 గంగాళములతో గోదా రంగనాథులకు నైవేద్యం సమర్పించారు. ముందుగా స్వామి వారికి సుప్రభాతం, అర్చన, బాలభోగ నివేదన, మంత్రపుష్పం, పాశుర విన్నపం, గోదా చతుశ్లోకి జరిపారు. సోమవారం భోగి పండగ రోజు ఉదయం 10 గంటలకు గోదా రంగనాథుల దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం గోదా దేవిని పెండ్లి కుమార్తెను చేయుట, నీరాట్ట ఉత్సవం నిర్వహిస్తామని తెలిపారు.



వైభవ వేంకటేశ్వరుని దర్శనం కోసం నిరీక్షిస్తున్న భక్తులు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీరంగనాథుడికి కూడార్తై పాశురం వినిపించారు. ఉదయం 4 గంటలకు గోదాదేవి విగ్రహంతో మేళతాళాల మధ్య వేద మంత్రోచ్చరణతో అర్చకుడు శేషాచార్యుడు, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. తిరుప్పావై సేవా కాలంలో భాగంగా గోదాదేవి తరఫున శ్రీరంగనాథస్వామికి 27వ పాశురం వినిపించారు. ఈ సందర్భంగా స్వామికి కూడారు ప్రసాదాన్ని కుండల్లో సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వందలాది భక్తులు పాల్గొని తరించారు. అనంతరం తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు.

పోలీసుల సూచనలు పాటించాలి



పోస్టర్ ఆవిష్కరించిన ఏసీపీ లక్ష్మణరావు, తదితరులు

మద్దిపాలెం : ఊరెళ్లే వారు దొంగతనాలు జరగకుండా ఉండేందుకు పోలీసుల సూచనలు పాటించాలని వెస్ట్ క్రైం ఏసీపీ లక్ష్మణరావు సూచించారు. ఈ మేరకు కంచరపాలెం క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తల కోసం పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ఊర్లెళ్లే వారు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు. ఇరుగుపొరుగున ఉండేవారికి కూడా సమాచారం అందించాలన్నారు. అపార్టుమెంట్‌లలో నివసించే వారు సీసీ కెమెరాలు, ఇంటర్ కమ్ ఫోన్లు పెట్టుకోవాలన్నారు. వాచ్‌మెన్‌ను నియమించుకోవాలని, కొత్త వ్యక్తులెవరైనా అపార్టుమెంట్‌కు వస్తే వారి పేరు, ఫోన్ నంబరు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్రైం సీఐ ఎన్.శ్రీనివాసరావు, ఎస్ఐలు సుదర్శనరావు, సూర్యనారాయణరావు పాల్గొన్నారు.

నగరవాసుల పల్లెబాట

సంక్రాంతి సంబరాలకు స్వగ్రామాలకు పయనం



సొంత ఊరు వెళ్తున్న నగరవాసులు

సీతమ్మధార : తెలుగునాట పెద్ద పండగ సంక్రాంతి. విశాఖ నగరంలో పలు రాష్ట్రాలు, ఇతర జిల్లాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో నివసిస్తున్నారు. ఎన్నో దశాబ్దాలుగా ఇక్కడే స్థిరపడి పలు వృత్తులు, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. వారంతా సంక్రాంతి పండగకు సెలవులు రావడంతో స్వస్థలాలకు ప్రయాణమయ్యారు. మరోవైపు పరీక్షలు అయిపోయిన తర్వాత విద్యార్థులకు ఇప్పటికే ఆయా విద్యా సంస్థలు సెలవులు ప్రకటించాయి. దీంతో గత రెండు రోజులుగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు సొంత ఊర్లకు వెళ్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా తదితర జిల్లాల వాసులు నగరంలో ఎక్కువగా స్థిరపడ్డారు. అదేవిధంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. వారంతా స్వస్థలాలకు నిత్యం పెద్ద సంఖ్యలో వెళ్తున్నారు. వేలాది మంది పల్లెబాట పట్టడంతో ప్రైవేట్ ట్రావెల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు, వ్యాన్లు, కార్లకు డిమాండ్ పెరిగింది. ఆర్టీసీ కాంప్లెక్సు ప్రయాణికులతో రద్దీగా ఉంది.

అన్ని బస్సులూ కిటకిటలాడుతున్నాయి. సీతమ్మధార, నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, ద్వారకానగర్, బాలయ్య శాస్త్రి లే అవుట్, గణేష్‌నగర్, తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న విద్యార్థులు అధిక సంఖ్యలో స్వస్థలాలకు బయలుదేరారు. సోమవారం భోగి, మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండగ కావడంతో నగరంలోని పలు ప్రాంతాలు వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ సందర్భంగా తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.



స్వస్థలాలకు బయలుదేరిన విద్యార్థులు

కిలో గంజాయి స్వాధీనం

సీతమ్మధార : కిలో గంజాయి రవాణా చేస్తున్న నిందితుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని నాలుగో పట్టణ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లాకు చెందిన వాసు కిలో గంజాయి కొనుగోలు చేసి సాలిగ్రామపురంలోని పోర్టు ఆస్పత్రి సమీపంలో శనివారం నిరీక్షిస్తున్నాడు. ఇంతలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి వాసుని అదుపులోకి తీసుకున్నారు. వాసు అరకులో గంజాయి కొనుగోలు చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసుని నాలుగో పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాహితీ సేవకు అంకితం

మురళీనగర్ : సాహితీ కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తూ సాహితీ సేవకు అంకితం చేద్దామని సాహితీ స్రవంతి సభ్యులు తీర్మానించారు. సాహితీ స్రవంతి విశాఖ జిల్లా అధ్యక్షుడు పాలమరశెట్టి ఫ్రాన్సిస్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. అందరినీ కలుపుకుంటూ విజయం దిశగా సాగుదామని అధ్యక్షుడు ఫ్రాన్సిస్ అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో రచయితలు తాము రచించిన కథ, కవితలు చదివి వినిపించారు. కవిత సమ్మేళనంలో రచయితలు ఎం.ఆనంద్ శర్మ, కె.భాస్కరరావు, కె.ఎర్నికుమార్, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల సంక్రాంతి సంబరాలు నేడు

సీతమ్మధార : విశాఖపట్నంలోని అన్ని బ్రహ్మకుమారి సేవా కేంద్రాల నిర్వాహకులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆదివారం నిర్వహిస్తారని బ్రహ్మకుమారీస్ సంస్థ మీడియా వింగ్ ప్రతినిధి రామేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతమ్మధార ఏపీఎస్ఈబీ పార్కు కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10.30 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, జాతీయ జర్నలిస్ట్ సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కళారంగంలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న సందీప్‌రెడ్డి, రమణమూర్తి

అల్లిపురం: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వన్‌టౌన్‌లో గల శ్రీ స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్ వివేకానంద ట్యూషన్ విద్యార్థులకు 6 సైకిళ్లు అందించారు. అనంతరం మాతృమూర్తులను సత్కరించారు. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు సందీప్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో లీడర్ దినపత్రిక వ్యవస్థాపకులు వీవీ రమణమూర్తి, వివేకానంద సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, యువ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, సంస్థ అధ్యక్షుడు అప్పారావు, కొల్లి సింహాచలం, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

తిక్కవానిపాలెం సంక్షేమ సేవా సంఘం కార్యవర్గం



పాలకవర్గాన్ని అభినందిస్తున్న గ్రామస్తులు

కంచరపాలెం : జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి తిక్కవానిపాలెం కాలనీలో శనివారం గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. తిక్కవానిపాలెం కాలనీ సంక్షేమ సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా గనకళ్ల శంకర్, ఉపాధ్యక్షుడిగా కోలా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా లుట్ట శివకుమార్, కార్యదర్శిగా కోడ ధనశేఖర్, సహాయ కార్యదర్శిగా గరికిన అప్పారావు, కోశాధికారిగా మద్దు శ్రీనివాస్, సలహాదారులుగా పట్టిమి నూకరాజు, సూరాడ కోటీశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులుగా గంటా నూకరాజు, అర్గనైజింగ్ సెక్రటరీలుగా మైలిపిల్లి బాలాజీ, గరికిన హేమంత్, గ్రామ కుల పెద్దగా గరికిన పరసయ్య, గ్రామ పెద్దలుగా వానపిల్లి అప్పన్న, వంకా అప్పారావు, మేడ గురప్ప, కోలా ధనరాజు, మైలపిల్లి అప్పారావు, కోడ ధనశేఖర్, పుక్కళ్ల పురుషోత్తం, జనపరెడ్డి శ్రీనివాస్, పుక్కళ్ల కొండబాబు, పైడివాడ శ్రీనివాస్ ఎన్నికైనట్లు గ్రామ ఎన్నికల కమిటీ సభ్యులు తెలిపారు.

తప్పుడు కేసులతో అరెస్ట్



భూమి పత్రాలు చూపిస్తున్న కోడూరు రామారావు

సీతంపేట : వంశపారపర్యంగా వస్తున్న తమ భూమిని ఆక్రమించుకోవడమే కాకుండా, తిరిగి తమపైనే కేసులు పెట్టి భయాందోళనకు గురి చేస్తున్నారని భీమిలికి చెందిన కోడూరు సంజీవరావు ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి జరిగిన అన్యాయంపై తండ్రి కోడూరు రామారావుతో కలిసి ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1946లో తమ తాత కోడూరు రామస్వామి కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన 1బి, అడంగల్ ఇప్పటికీ తమ పేరుపైనే ఉన్నాయని తెలిపారు. అయితే ఈ స్థలాన్ని ఎంఆర్‌కే రాజు కొనుగోలు చేసినట్టు, అతను చక్రవర్తి అనే మరో వ్యక్తికి అమ్మినట్టు రెవెన్యూ అధికారులు చెబుతున్నారని, మేము ఎవరికీ ఆ భూమిని అమ్మలేదని స్పష్టం చేశారు. చక్రవర్తికి కొమ్ము కాస్తూ పోలీసులు దళితులమైన తమపై తప్పుడు కేసులుపెట్టి అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, తమకు న్యాయం చేయాలని కోరారు.

బాలిక ఆచూకీ తెలపాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న బాలిక కుటుంబ సభ్యులు

సీతమ్మధార: నిరుపేద కుటుంబానికి చెందిన బాలిక (16) డిసెంబర్ 19న అదృశ్యమైంది. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో జాప్యం జరగడంతో వారు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కలిసి మరోసారి ఫిర్యాదు చేయడంతో ఫిర్యాదును నాలుగో పట్టణ పోలీసులకు బదిలీ చేసి దర్యాప్తు వేగవంతం చేయమని చెప్పారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు హైదరాబాద్‌లో బాలిక మిత్రులు ఉన్నారని అనుమానిస్తూ విశాఖ నుంచి హైదరాబాద్‌కు బాలిక తల్లిదండ్రులను తీసుకెళ్లారు. ఇందుకు బాలిక తల్లిదండ్రులు రూ. 6 వేలు అప్పు చేసి వెళ్లారు. అయితే బాలిక ఆచూకీ లభ్యం కాక నిరాశతో వెనుదిరిగారు. కొన్ని రోజుల తర్వాత రాజమండ్రిలో బాలిక ఆచూకీ లభ్యమైందని అక్కడికి వెళ్లాలని పోలీసులు బాలిక తల్లిదండ్రులకు చెప్పారు. అయితే అక్కడికి వెళ్లేందుకు తమ వద్ద డబ్బు లేదని వారు తెలపడంతో పోలీసులు తలలు పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో తమ కుమార్తె ఆచూకీ వెంటనే కనుగొనాలని బాలిక తల్లి జి.పార్వతి కోరుతూ జీవీఎంసీ గాంధీ పార్కులో కుటుంబ సభ్యులతో కలిసి నోటికి నల్లరిబ్బన్లు ధరించి శనివారం నిరసన తెలిపారు. సీపీ ఆదేశాలతో అయినా పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి తమ కుమార్తె ఆచూకీ కనుగొనాలని కోరారు. తాము తాటిచెట్లపాలెం లెప్రసీ కాలనీలో నివాసం ఉంటున్నామని తెలిపారు. అమాయకమైన ఆడపిల్లలను మాయతో మోసం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని బాలిక కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. నిరసనలో పార్వతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి మాస్టర్ ఈకే

మహారాణిపేట: మాస్టర్ ఈకే ఆదర్శనీయులని కులపతి బుక్ ట్రస్ట్ అధ్యక్షుడు సి.హెచ్.ఎస్.ఎన్. రాజు అన్నారు. జగద్గురు పీఠం మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న 64వ మాస్టర్ సీవీవీ గురు పూజోత్సవాలలో భాగంగా శనివారం ఆంకోశ సమావేశ మందిరంలో జరిగిన మాస్టర్ ఈకే గ్రంథావిష్కరణ సభలో ఆయన ప్రసంగించారు. ఈకే ఐరోపా యాత్ర అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించగా లలితా సహస్రనామ రహస్య ప్రకాశం అనే పుస్తకాన్ని కె.రాంప్రసాద్, బుక్ ఆఫ్ రిచువల్స్‌ను కె.రవీంద్రనాథ్, 'తైత్తిరీయోపనిషత్‌ను చింతలపాటి సత్యదేవ్ ఆవిష్కరించారు. సంస్థ కార్యదర్శి బి.ఆర్.కె. రాజు, ఉప్పలపాటి భూపాలవర్మ, పప్పు రవిశంకర్ పాల్గొన్నారు.